APTEL/2009/29308

# స్నేహిత ఎక్స్‌ప్రెస్

నిజం దాగదు.. వార్త ఆగదు

తెలుగు దినపత్రిక

17-04-2026
శుక్రవారం
హైదరాబాద్
సంపుటి: 17 । సంచిక: 174
పేజీలు: 04 । వెల: 5/-
ఎడిటర్: రాథోడ్ వినోద్ కుమార్

FOLLOW:
https://epaper.expresstelugudaily.com



## రాష్ట్రంలో రోడ్డు ప్రమాద మృతులే అధికం

- ఏటా 700 వరకు హత్యలు జరిగితే.. 7,500 మంది రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నారు
- భద్రతా నిబంధనలు పాటించకపోవడమే ప్రధాన కారణం
- ద్విచక్ర వాహనదారులు, వారి వెనక కూర్చున్న వాళ్లు హెల్మెట్ ధరించాలి
- తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి

2

## రేవంత్‌రెడ్డి వైషమ్యాలు సృష్టిస్తున్నారు

- తెలంగాణలో 50 శాతం సీట్లు పెరిగితే.. యూపీలో 50 శాతం పెరుగుతాయి
- కేరళ కంటే తెలంగాణ జనాభా ఎక్కువ
- కేరళలో 20 ఎంపీ సీట్లు ఉంటే.. తెలంగాణలో 17 మాత్రమే ఉన్నాయి
- సీఎం రేవంత్ ముందు కేరళలో సీట్లు తగ్గించమని కోరాలి
- రాష్ట్ర ప్రభుత్వం చేసిన కుల గణన సక్రమంగా జరగలేదు
- ఉత్తరాదిలో కాంగ్రెస్ లేదు.. దక్షిణాదిలో కూడా పోతుంది
- తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్‌రావు



2

## పార్లమెంట్ మాదిరిగా అసెంబ్లీలో సెంట్రల్ హాల్

- శాసన మండలి సభ్యులకు, శాసన సభ సభ్యులకు సౌకర్యవంతంగా ఉండాలి
- పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలి
- మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి



2


మహిళా రిజర్వేషన్ల అమలు కోసం తీసుకొచ్చిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లుపై చర్చలో పాల్గొన్న ప్రధాని నరేంద్ర మోడీ వికసిత్ భారత్ లక్ష్య సాధనలో మహిళల పాత్ర చాలా కీలకమని వివరించారు. మహిళలకు అవకాశం ఇస్తే దేశానికి సరికొత్త మార్గం చూపిస్తారని పేర్కొన్నారు. గతంలో మహిళా రిజర్వేషన్ల బిల్లుకు అన్ని పార్టీలు మద్దతు ఇచ్చిన విషయం గుర్తుచేసిన ప్రధాని రిజర్వేషన్లను త్వరగా అమలుచేసేందుకు చేస్తున్న ప్రయత్నానికి ఇప్పుడు కూడా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. మహిళా బిల్లును వ్యతిరేకించే వారిని మహిళలు క్షమించరన్న ప్రధాని మోడీ, సమయం చూసి తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

## మహిళా రిజర్వేషన్

# గొప్ప బిల్లు

### దేశ పార్లమెంటరీ చరిత్రలో ఈరోజును మరచిపోలేం

### మహిళా రిజర్వేషన్లను వ్యతిరేకిస్తే మూల్యం తప్పదు




**నేషనల్ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** మహిళా రిజర్వేషన్లను తీసుకురావడంలో ఎలాంటి రాజకీయ దురుద్దేశం లేదని ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్పష్టం చేశారు. డీలిమిటేషన్ వల్ల ఏ రాష్ట్రానికీ అన్యాయం జరగదని పేర్కొన్నారు . చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లకు తుది రూపం ఇచ్చేందుకు, డీలిమిటేషన్ ద్వారా నియోజకవర్గాలను పెంచేందుకు, పునర్విభజించేందుకు ఉద్దేశించిన 3 కీలక బిల్లులను కేంద్రం గురువారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. వీటిపై చర్చలో భాగంగా ప్రధాని మోడీ సభలో ప్రసంగించారు. మహిళా రిజర్వేషన్ల ను వ్యతిరేకించే వారు మూల్యం చెల్లించుకోక..

మిగతా 2లో...

- దేశ ప్రగతిలో మహిళలకూ భాగస్వామ్యం కల్పించాల్సిందే
- మహిళలకు అవకాశం ఇస్తే దేశానికి సరికొత్త మార్గం చూపిస్తారు
- మహిళల బిల్లు విషయంలో అందరూ కలిసి రావాలి
- చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు కానుక కాదు.. వారి హక్కు
- ఈ బిల్లుపై క్రెడిట్ నాకు అవసరం లేదు
- మహిళా బిల్లుపై అన్ని పార్టీల నేతల ఫొటోలూ వేసుకోండి
- మహిళా రిజర్వేషన్ల సవరణ బిల్లును ఏకగ్రీవంగా ఆమోదిద్దాం
- డీలిమిటేషన్ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి నష్టం జరగదు
- చిన్న రాష్ట్రం, పెద్ద రాష్ట్రం, ఉత్తరాది, దక్షిణాది అనే భేదభావం మాకు లేదు
- ఏ ప్రాంతానికీ అన్యాయం జరగదని హామీ ఇస్తున్నాం
- లోక్‌సభలో నరేంద్ర మోడీ



2

## తేజస్వి సూర్య నీకెంత ధైర్యం?

- తెలంగాణ సాధన కోసం జరిగిన పోరాటాన్నికించపరుస్తావా?
- ఇక్కడి ప్రజల ఆకాంక్షలంటే అంత చులకనా?
- తెలంగాణ బీజేపీ ఎంపీలకు పౌరుషముంటే ఈ వ్యాఖ్యలను ఖండించాలి
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

## లోక్‌సభ ముందుకు మూడు బిల్లులు

### వాడీవేడి చర్చ- నేటి సాయంత్రం ఓటింగ్

- బిల్లులపై సభ్యులు ఎన్ని గంటలు కోరినా చర్చ జరపవచ్చు: లోక్‌సభ స్పీకర్
- డీలిమిటేషన్ బిల్లు ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకించిన విపక్షాలు
- మహిళా రిజర్వేషన్లను నియోజకవర్గాల పునర్విభజనతో ముడిపెట్టడాన్ని తప్పుపట్టాయి
- విపక్షాల వాదనను తోసిపుచ్చిన అధికార పక్షం



2

## శాంతి, సుస్థిరతలకే మా మద్దతు

- యుద్ధ క్షేత్రాల్లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల ప్రభావం ప్రపంచ వ్యాప్తంగా పడుతోంది
- ఈ సైనిక ఘర్షణ సమస్యలను పరిష్కరించలేదు
- అంతర్జాతీయ సవాళ్లను ఎదుర్కోవడానికి సంస్కరణలు చేపట్టాలి
- ఇందుకోసం ఉగ్రవాదాన్ని పారదోలడం ఎంతైనా అవసరం: ప్రధాని మోడీ
- ఆస్ట్రియా నర్సింగ్ రంగంలో భారత నిపుణులకు అవకాశం
- టన్నెలింగ్, ఇంజినీరింగ్‌లలో ఆస్ట్రియాకు అపార అనుభవం ఉంది
- ఆస్ట్రియన్ ఛాన్సెలర్ క్రిస్టియన్ స్టాకర్‌తో కలిసి ప్రెస్‌మీట్‌లో పాల్గొన్న మోడీ

2



## ప్రపంచంలోనే హైదరాబాద్ మొదటి స్థానం

- ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాల్లో దూసుకెళ్తున్న తెలంగాణ
- రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేలా అమెరికా పారిశ్రామికవేత్తల్ని ప్రోత్సహించాలి
- ఆ దేశ ఉన్నతస్థాయి ప్రతినిధి బృందాన్ని కోరిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

2

విలేకరులు కావలెను

స్నేహిత ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక
expresstelugudaily.com

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో

ఎక్స్‌ప్రెస్ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు మండల రిపోర్టర్లు, యాడ్స్ ఏజెంట్స్ వెంటనే కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు..

Contacts
తెలంగాణ
95500 21491

# శాంతి, సుస్థిరతలకే మా మద్దతు

**నేషనల్ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** పశ్చిమాసియా, ఉక్రెయిన్ యుద్ధాలపై భారత ప్రధానమంత్రి నరేంద్రమోడీ కీలక వ్యాఖ్యలు చేశారు. సైనిక ఘర్షణ సమస్యలను పరిష్కరించలేదని ఆయన స్పష్టం చేశారు. ఈవిషయంలో భారత్, ఆస్ట్రియాలు ఏకాభిప్రాయంతో ఉన్నాయని మోడీ తేల్చి చెప్పారు. అది ఉక్రెయిన్ అయినా, పశ్చిమాసియా అయినా శాంతి, సుస్థిరతలకే తమ మద్దతు ఉంటుందన్నారు. నానాటికీ పెరుగుతున్న ప్రపంచ సవాళ్లకు పరిష్కారాలను సూచించేందుకు అంతర్జాతీయ స్థాయి సంస్థల్లో సంస్కరణలు జరగాలనే దానిపైనా భారత్, ఆస్ట్రియాలు ఒకే అభిప్రాయంతో ఉన్నాయని ప్రధాని చెప్పారు. ఆస్ట్రియా ఛాన్స్‌లర్ క్రిస్టియన్ స్టాకర్ నాలుగు రోజుల భారత పర్యటన కోసం మంగళవారమే న్యూఢిల్లీకి చేరుకున్నారు. గురువారం రోజు భారత ప్రధాని, ఆస్ట్రియా ఛాన్స్‌లర్ ద్వైపాక్షిక భేటీ జరిగింది. అనంతరం ఏర్పాటుచేసిన సంయుక్త మీడియా సమావేశంలో నరేంద్ర మోడీ మాట్లాడారు.



**ప్రపంచంలో చాలా సీరియస్, ఉద్రిక్త పరిస్థితులు..**

''ప్రస్తుతం యావత్ ప్రపంచం చాలా సీరియస్, ఉద్రిక్త పరిస్థితులను చవిచూస్తోంది. ఈ సవాళ్లు అన్ని ప్రపంచ దేశాలను ప్రభావితం చేస్తున్నాయి, ఆందోళనకు గురి చేస్తున్నాయి. సైనిక ఘర్షణలను కొనసాగిస్తూ పోతే, శాశ్వత పరిష్కారం అనేది అస్సలు లభించదు. అందుకే పశ్చిమాసియా, ఉక్రెయిన్‌లలో శాంతి, సుస్థిరతల స్థాపన అత్యవసరమని భారత్, ఆస్ట్రియా భావిస్తున్నాయి. ఇక ఉగ్రవాదాన్ని కూకటి వేళ్లతో సహా పెకిలించాలనే ఉమ్మడి లక్ష్యాన్ని ఇరుదేశాలు కలిగి ఉన్నాయి'' అని ప్రధాని మోడీ చెప్పారు.

**భారత వాణిజ్యం, పెట్టుబడులకు కొత్త శక్తి..**

''ఇటీవలె భారత్ యూరోపియన్ యూనియన్ (ఈయూ) మధ్య చారిత్రక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) కుదిరింది. దీంతో భారత్, ఈయూ మధ్య సరికొత్త సువర్ణ అధ్యాయం మొదలైంది. నేను 2024లో ఆస్ట్రియా పర్యటనకు వెళ్లాను. గత 4 దశాబ్దాల్లో ఆస్ట్రియా పర్యటనకు వెళ్లిన తొలి భారత ప్రధానమంత్రిని నేనే. ఆ పర్యటన ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాల్లో కీలక మైలురాయిగా నిలిచింది. ఇప్పుడు ఆస్ట్రియా ఛాన్స్‌లర్ విదేశీ పర్యటనలో తొలి గమ్యస్థానంగా భారతే ఉండటం సంతోషకరం. భారత్‌తో సంబంధాల బలోపేతానికి ఆస్ట్రియా ఇస్తున్న ప్రాధాన్యానికి ఇదొక నిదర్శనం. ఈ పర్యటనతో ఇరుదేశాల మధ్య సహకారం, అన్ని రంగాల్లో వికాసం విషయంలో కొత్త దశ మొదలవుతుందని ఆశిస్తున్నాం. దీంతో భారతదేశ వాణిజ్యం, పెట్టుబడుల విభాగాలకూ కొత్త శక్తి లభిస్తుంది'' అని ప్రధాని మోడీ తెలిపారు.

**ఆస్ట్రియా నర్సింగ్ రంగంలో భారత నిపుణులకు ఛాన్స్**

''ఆస్ట్రియా అనుభవం, భారత్ వేగం, స్థాయులను కలగలిపి యావత్ ప్రపంచం కోసం విశ్వసనీయమైన టెక్నాలజీలు, సప్లై చైన్లను అందుబాటులోకి తెస్తాం. రక్షణ, సెమీ కండక్టర్లు, క్వాంటమ్, బయోటెక్నాలజీ విభాగాల్లోనూ ఇరుదేశాల భాగస్వామ్యాన్ని బలోపేతం చేస్తాం. ఇందులో భాగంగా గురువారం రోజు ఐఐటీ ఢిల్లీ, ఆస్ట్రియాలోని మోంటన్ యూనివర్సిటీ మధ్య అవగాహనా ఒప్పందం (ఎంఓయూ) కుదిరింది. 2023లోనే భారత్ ఆస్ట్రియా మధ్య సమగ్ర వలసలు, మొబిలిటీ ఒప్పందం కుదిరింది. ఇప్పుడు కొత్తగా కుదిరిన ఒప్పందంలో భాగంగా నర్సింగ్ రంగంలోని భారత నిపుణులు కూడా ఆస్ట్రియాకు వెళ్లొచ్చు. సంయుక్త పరిశోధనలు, స్టార్టప్‌ల భాగస్వామ్యం వంటి విభాగాలనూ బలోపేతం చేస్తాం. గురువారం రోజు మేం ఇండియా ఆస్ట్రియా వర్కింగ్ హాలిడే కార్యక్రమాన్నీ ప్రారంభిస్తున్నాం'' అని ప్రధాని మోడీ పేర్కొన్నారు.

**టన్నెలింగ్, ఇంజినీరింగ్‌లలో ఆస్ట్రియాకు అపార అనుభవం..**

''మౌలిక సదుపాయాలు, ఆవిష్కరణలు, సుస్థిరతతో ముడిపడిన పలు విభాగాల్లో భారత్, ఆస్ట్రియాలు ఇప్పటికే కలిసి పనిచేస్తున్నాయి. ఢిల్లీ మెట్రో, రైల్వే మౌలిక సదుపాయాల అభివృద్ధి, స్వచ్ఛ ఇంధన ఉత్పత్తి, పట్టణ వికాసం, అటల్ టన్నెల్ (హిమాచల్ ప్రదేశ్), గిర్నార్ రోప్ వే (గుజరాత్) లాంటి ఇంజినీరింగ్ అద్భుతాలను సాకారం చేయడంలో ఆస్ట్రియన్ కంపెనీలు కీలక పాత్ర పోషించాయి. సొరంగాల నిర్మాణం(టన్నెలింగ్), ఇంజినీరింగ్ అద్భుతాల ఆవిష్కరణలో ఆస్ట్రియాకు అపార అనుభవం ఉంది. ఇది భారతదేశంలో అభివృద్ధి ప్రాజెక్టులను పూర్తి చేయడానికి ఎంతో దోహదం పడింది. హిమాలయాల్లో 10వేల అడుగుల ఎత్తులో అటల్ టన్నెల్‌ను నిర్మించారు. ఇప్పుడు కూడా ఎన్నో భారత మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల్లో ఆస్ట్రియన్ కంపెనీల భాగస్వామ్యం ఉంది'' అని ప్రధాని తెలిపారు.

**ఆ 3 విభాగాల్లో కలిసి పనిచేస్తాం : స్టాకర్..**

భారత్, ఆస్ట్రియాలు వాణిజ్యం, టెక్నాలజీ, హరిత ఇంధనం వంటి విభాగాల్లో సహకారాన్ని బలోపేతం చేసుకుంటాయని ఆస్ట్రియా ఛాన్స్‌లర్ క్రిస్టియన్ స్టాకర్ వెల్లడించారు. దీనివల్ల ఇరుదేశాల ప్రజలు, వ్యాపారాలకు కొత్త అవకాశాలు ఏర్పడతాయన్నారు. భవిష్యత్తులో ఈయూభారత్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అమలు సహా అన్ని విభాగాల్లోనూ కలిసికట్టుగా పనిచేస్తామని ఆయన తెలిపారు. గత 4 దశాబ్దాల్లో భారత్‌లో పర్యటించిన తొలి ఆస్ట్రియా ఛాన్స్‌లర్‌ను తానేనని స్టాకర్ చెప్పారు. 75 ఏళ్ల చరిత్ర కలిగిన భారత్ ఆస్ట్రియా స్నేహంలో మరో కొత్త అధ్యాయాన్ని మొదలుపెడుతున్నామని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా అస్థిరతలు పెరుగుతున్న ఈ తరుణంలో ఉమ్మడి విలువల ప్రాతిపదికన భారత్, ఆస్ట్రియా లాంటి విశ్వసనీయ దేశాలు చేతులు కలుపుతున్నాయని ఆయన తెలిపారు. తనను భారత్‌కు ఆహ్వానించినందుకు, గొప్ప ఆతిథ్యాన్ని అందించినందుకు ప్రధాని మోడీకి స్టాకర్ ధన్యవాదాలు చెప్పారు. ఈమేరకు సందేశాలతో ఆయన ట్వీట్లు చేశారు.

**మహాత్మాగాంధీకి స్టాకర్ నివాళులు..**

ప్రధాని మోడీతో భేటీకి ముందు, ఆస్ట్రియా ఛాన్స్‌లర్ క్రిస్టియన్ స్టాకర్ రాజ్‌ఘాట్‌కు వెళ్లి మహాత్మాగాంధీకి నివాళులు అర్పించారు. ఈవివరాలతో భారత విదేశాంగ శాఖ ఒక ట్వీట్ చేసింది. దీని ప్రకారం మోడీ, స్టాకర్‌ల ద్వైపాక్షిక సమావేశంలో వాణిజ్యం, పెట్టుబడులు, టెక్నాలజీ, పునరుత్పాదక ఇంధన వనరులు, కల్చరల్ ఎక్స్ఛేంజ్ కార్యక్రమాలపై చర్చించారు.

## మహిళా రిజర్వేషన్ గొప్ప బిల్లు

(మొదటి పేజీ తరువాయి)

తప్పదంటూ విపక్షాలను హెచ్చరించారు.

**గిఫ్ట్ కాదు.. ఇది హక్కు..**

''దేశ పార్లమెంట్ చరిత్రలో ఈ రోజును మర్చిపోలేం. మహిళా రిజర్వేషన్ గొప్ప బిల్లు. ఈ చారిత్రక సమయంలో పాలు పంచుకోవడం నా అదృష్టం. ఈ బిల్లులతో దేశానికి సరికొత్త దశ, దిశను ఇస్తున్నాం. వికసిత్ భారత్ అంటే రోడ్లు, రైళ్లు, మౌలిక సదుపాయాలు మాత్రమే కాదు. మహిళల స్వావలంబన కూడా ఉంటేనే అది సంపూర్ణ వికసిత్ భారత్ అవుతుంది. దేశ రాజకీయాల్లో, వికసిత్ భారత్ సాధనలో మహిళల పాత్ర కీలకం. మహిళలకు అవకాశమిస్తే దేశానికి సరికొత్త మార్గం చూపిస్తారు. రాజకీయాల్లో తమ శక్తిని చాటేందుకు మహిళలు సిద్ధంగా ఉన్నారు. ఎవరికైనా అవకాశమిస్తేనే కదా.. వారి సామర్థ్యం తెలుస్తుంది. రాజకీయాల్లో సామర్థ్యం, అనుభవం ఉన్న మహిళలు పుష్కలంగా ఉన్నారు. దేశ ప్రగతిలో మహిళలకూ భాగస్వామ్యం కల్పించాల్సిందే. చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు.. మహిళలకు మనం ఇస్తున్న కానుక కాదు. అది వారి హక్కు'' అని మోడీ వ్యాఖ్యానించారు.

**ఆ పార్టీలకే మనుగడ..**

''మహిళా రిజర్వేషన్ల కోసం 30 ఏళ్ల పాటు ప్రయత్నాలు జరిగినా గతంలో ఇది సాకారం కాలేదు. 2024 ఎన్నికల్లో వీటిని అమలు చేద్దామని మేం ప్రయత్నించినా సాధ్యం కాలేదు. 2029 ఎన్నికల్లోనూ రిజర్వేషన్లు ఇవ్వకపోతే మహిళలకు అన్యాయం చేసినట్లే. ఈ బిల్లును తేవడంలో ఎలాంటి రాజకీయ దురుద్దేశం లేదు. ఇది రాజకీయ పార్టీల కోసం తెచ్చింది కాదు. మహిళా రిజర్వేషన్లను వ్యతిరేకించే వారిని మహిళలు క్షమించరు. బిల్లును వ్యతిరేకించే పార్టీలకు, నేతలకు మహిళలు బుద్ధి చెబుతారు. సమయం చూసి దెబ్బకొడుతారు. మహిళా బిల్లులకు మద్దతిచ్చే పార్టీలకే మనుగడ ఉంటుంది'' అని విపక్షాలకు ప్రధాని చురకలంటించారు.

**దక్షిణాదికి ఎలాంటి నష్టం లేదు..**

''ఈ బిల్లును తీసుకురాగానే కొందరు విభజన రాజకీయాలు చేస్తున్నారు. ఉత్తరాది, దక్షిణాది అంటూ మాట్లాడుతున్నారు. అలాంటి వారిని ప్రజలు ఇప్పటికే దూరం పెట్టారు. డీలిమిటేషన్ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి నష్టం జరగదు. చిన్న రాష్ట్రం, పెద్ద రాష్ట్రం, ఉత్తరాది, దక్షిణాది అనే భేదభావం మాకు లేదు. ఏ ప్రాంతానికీ అన్యాయం జరగదని హామీ ఇస్తున్నాం'' అని మోడీ స్పష్టం చేశారు.

**నాకు క్రెడిట్ వద్దు.. మీరే తీసుకోండి..**

''ఈ బిల్లుతో దేశంలోని మహిళలకు వారి హక్కులను కల్పిస్తున్నాం. ఈ బిల్లుపై క్రెడిట్ నాకు అవసరం లేదు. మీరే (విపక్షాలను ఉద్దేశిస్తూ) తీసుకోండి.. మహిళా బిల్లుపై అన్ని పార్టీల నేతల ఫొటోలూ వేసుకోండి. ఈ బిల్లును అడ్డుకోకుండా సహకరించి మీ గొప్పతనం చాటుకోండి. మహిళా రిజర్వేషన్ల సవరణ బిల్లును ఏకగ్రీవంగా ఆమోదిద్దాం'' అని మోడీ విపక్షాలను కోరారు.

## లోక్‌సభ ముందుకు మూడు బిల్లులు

**నేషనల్ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో భాగంగా లోక్‌సభ ముందుకు మూడు కీలక బిల్లులు వచ్చాయి. దేశంలో మహిళా రిజర్వేషన్లు అమలు చేసే దిశగా కేంద్రం తీసుకొచ్చిన మూడు కీలక బిల్లులపై లోక్ సభలో వాడీవేడి చర్చ జరిగింది. మొదట ఈ బిల్లులను సభలో ప్రవేశపెట్టడాన్ని విపక్షాలు వ్యతిరేకించాయి. మహిళా రిజర్వేషన్లను నియోజకవర్గాల పునర్విభజనతో ముడిపెట్టడాన్ని తప్పుపట్టాయి. విపక్షాల వాదనను అధికార పక్షం తోసిపుచ్చింది. ఈ క్రమంలో రాజ్యాంగ సవరణ బిల్లుపై జరిగిన ఓటింగ్‌లో ప్రభుత్వానికి అనుకూలంగా మెజార్టీ.. వచ్చింది. అనంతరం 131వ రాజ్యాంగ సవరణ బిల్లుపై చర్చ నెలకొంది. మహిళా రిజర్వేషన్లకు సంబంధించి 131వ రాజ్యాంగ చట్ట సవరణ బిల్లును న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ ప్రవేశపెట్టారు. అనంతరం నియోజకవర్గాల పునర్విభజన బిల్లును కూడా ఆయన సభ ముందుకు తీసుకొచ్చారు. అంతకుముందు కేంద్రపాలిత ప్రాంతాల చట్టాల సవరణ బిల్లును హోంమంత్రి అమిత్‌షా ప్రవేశపెట్టారు. అయితే 131వ రాజ్యాంగ చట్ట సవరణ బిల్లును ప్రవేశపెట్టడాన్ని విపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ, డీఎంకే, టీఎంసీ, కేరళ రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ, ఎంఐఎం, సిపిఐ, ఇతర విపక్షాలు బిల్లును వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశాయి. ఈ బిల్లు ద్వారా ప్రభుత్వం బుల్డోజ్ చేస్తోందని మండిపడ్డాయి. "అప్రజాస్వామిక బిల్లును ఉపసంహరించుకోవాలి. జనాభా గణనపై ప్రభుత్వం ఎందుకు ఆసక్తి చూపట్లేదు? కేంద్రం ఉద్దేశపూర్వకంగా ముస్లింలను మినహాయిస్తోంది. మూడు బిల్లులను కేంద్రం ఉపసంహరించుకోవాలి." అని సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ డిమాండ్ చేశారు. ఈ క్రమంలోనే విపక్షాల ఆరోపణలను కేంద్ర హోంమంత్రి అమిత్ షా తోసిపుచ్చారు. ప్రజల్లో ఆందోళన కలిగించేలా విపక్షాల వ్యాఖ్యలున్నాయని ఆయన మండిపడ్డారు. జనగణన ఎందుకు చేపట్టలేదని విపక్షాలు చెప్పడం సరికాదన్న ఆయన, ఆ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభం అయ్యిందని వివరించారు. ప్రస్తుతం ఇళ్ల గణన జరుగుతోందని, ఇళ్లకు ఎలాంటి జాతి ఉండదని పేర్కొన్నారు. వ్యక్తుల గణన సమయంలో జాతి ప్రస్తావన ఉంటుందని స్పష్టం చేశారు.

## రాష్ట్రంలో రోడ్డు ప్రమాద మృతులే అధికం

**జడ్చర్ల, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** తెలంగాణలో ఏటా 700 వరకు హత్యలు జరిగితే.. 7,500 మంది రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నారని, దీనికి ప్రధాన కారణం భద్రతా నిబంధనలు పాటించకపోవడమేనని డీజీపీ శివధర్‌రెడ్డి అన్నారు. 'ఎరైవ్.. ఎలైవ్'లో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. ప్రమాదాలు అరికట్టేందుకు అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో 'ఎరైవ్, ఎలైవ్' కార్యక్రమాన్ని రాష్ట్రంలో ఉద్యమంలా చేపట్టినట్లు వివరించారు. కారు డ్రైవర్‌తో పాటు అందులో ఉన్న ప్రతి ఒక్కరూ సీట్ బెల్ట్ పెట్టుకోవాలని, ద్విచక్ర వాహనదారులు, వారి వెనక కూర్చున్న వాళ్లు హెల్మెట్ ధరించాలని సూచించారు. పలు గ్రామాల్లో హెల్మెట్ లేకుండా బైక్ చోదకులను గ్రామాలకు రానీయడంలేదని, ఇక్కడా ఎమ్మెల్యే అలాంటి చర్యలు తీసుకోవాలని అభిప్రాయపడ్డారు.ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇప్పటి నుంచి హెల్మెట్ లేకుండా బైక్‌పై ప్రయాణించబోనని, కాంగ్రెస్ కార్యకర్తలూ పాటించేలా చూస్తానని చెప్పారు. జడ్చర్లలో రూరల్, ట్రాఫిక్ ఠాణాల ఏర్పాటుకు డీజీపీకి వినతిపత్రం అందించారు. దీర్ఘకాలం ఆర్టీసీలో పనిచేస్తున్న డ్రైవర్లు, ప్రమాదాల నియంత్రణకు నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను అంతకుముందు డీజీపీ సత్కరించారు. ఈ సందర్భంగా హెల్మెట్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో జోగులాంబ జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్, కలెక్టర్ ఖుష్బూ గుప్తా, ఎస్పీ జానకి, ఆర్టీసీ ఆర్ఎం సంతోష్‌కుమార్, పురపాలిక ఛైర్‌పర్సన్ పుష్పలత పాల్గొన్నారు.

## ప్రపంచంలోనే హైదరాబాద్ మొదటి స్థానం

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాల్లో దేశంలోనే అగ్రగామిగా దూసుకెళ్తున్న తెలంగాణలో పెట్టుబడులు పెట్టేలా అమెరికా పారిశ్రామికవేత్తల్ని ప్రోత్సహించాలని ఆ దేశ ఉన్నతస్థాయి ప్రతినిధి బృందాన్ని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కోరారు. సెక్రెటేరియట్‌లో గురువారం యూఎస్ నేషనల్ కాలేజ్ వార్ బృంద సభ్యులతో మంత్రి ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాల్లో తెలంగాణలో ఉన్న అవకాశాలు, ఇక్కడి అనుకూలతలు, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పాలసీలు మంత్రి శ్రీధర్‌బాబు ఈ సందర్భంగా వివరించారు. డ్రోన్లు, కౌంటర్ డ్రోన్ సిస్టమ్స్, ఏరోస్పేస్ కాంపోనెంట్స్, డిఫెన్స్ ఎలక్ట్రానిక్స్, సైబర్ సెక్యూరిటీ, స్పేస్ టెక్నాలజీ, ఏఐ ఇన్ డిఫెన్స్, శాటిలైట్స్ సిస్టమ్స్ అండ్ అడ్వాన్స్డ్ కమ్యూనికేషన్స్‌లో రాష్ట్రాన్ని గ్లోబల్ లీడర్‌గా తీర్చిదిద్దేలా తమ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నదని చెప్పారు. రాకెట్ల తయారీ నుంచి అత్యాధునిక డ్రోన్ల వరకు, యుద్ధ విమానాల విడిభాగాల నుంచి శాటిలైట్ల వరకు.. అన్నింటిలోనూ మేడిన్ తెలంగాణ మార్క్ ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా కనిపిస్తున్నదని తెలిపారు. ఈ రంగంలో తెలంగాణ ఏటా 30 శాతానికి పైగా వృద్ధి రేటును నమోదు చేస్తున్నదన్నారు. అలాగే.. 202426 మధ్య కాలంలో ఎగుమతుల్లో 103 శాతం కాంపౌండ్ యాన్యువల్ గ్రోత్ రేట్ (సీఏజీఆర్) నమోదైందన్నారు. లాక్హీడ్ మార్టిన్, బోయింగ్, సాఫ్రాన్, ఎయిర్ బస్, డస్సాల్ట్ ఏవియేషన్ తదితర ప్రపంచ దిగ్గజ ఏరోస్పేస్ కంపెనీలతో డీఆర్డీవో, భెల్, మిధాని, బీడీఎల్,ఆర్ సీఐ, హాల్ తదితర కేంద్ర రంగ ప్రభుత్వ సంస్థలు ఇక్కడ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయన్నారు. ఇవే కాకుండా ప్రిసిషన్ ఇంజినీరింగ్, డ్రోన్లు, డిఫెన్స్ ఎలక్ట్రానిక్స్ రంగాల్లో 1,500 కంటే ఎక్కువ ఎంఎస్ఎంఈలు తెలంగాణ బ్రాండ్‌ను విశ్వవ్యాప్తం చేస్తున్నాయన్నారు. ఫైనాన్షియల్ టైమ్స్ ఎఫ్‌డీఏ ర్యాంకింగ్స్ ప్రకారం ప్రపంచంలోనే అత్యంత కాస్ట్ ఎఫెక్టివ్ ఏరోస్పేస్ సిటీగా హైదరాబాద్ మొదటి స్థానంలో నిలిచిందన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వరుసగా ఐదుసార్లు బెస్ట్ స్టేట్ ఫర్ ఏరోస్పేస్ అవార్డును గెలుచుకుని గ్లోబల్ ఏరోస్పేస్ మ్యాప్‌లో తెలంగాణ ఒక శక్తిమంతమైన కేంద్రంగా మారిందన్నారు. టీజీ ఐపాస్ ద్వారా 15 నుంచి 30 రోజుల్లోగా అనుమతులు.. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ద్వారా ఈ రంగానికి అవసరమైన రెడీ టూ స్కిల్ వర్క్ ఫోర్స్‌ను అందిస్తున్నామన్నారు. పెట్టుబడులకు మాత్రమే కాదు, సాంకేతికత, పరిశోధన, తయారీ, నైపుణ్యాభివృద్ధిలో అమెరికాకు ఒక నమ్మకమైన దీర్ఘకాల వ్యూహాత్మక భాగస్వామిగా నిలిచేందుకు తెలంగాణ సిద్ధంగా ఉన్నదని స్పష్టం చేశారు. తెలంగాణ లాంటి ప్రగతిశీల రాష్ట్రాలతో కలిసి పనిచేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, రాబోయే రోజుల్లో ఆ దిశగా అడుగులు వేస్తామని అమెరికాతెలంగాణ మధ్య ద్వైపాక్షిక సహకారాన్ని పెంపొందించేందుకు చొరవ చూపుతామని స్టేట్ డిపార్ట్‌మెంట్ మినిస్టర్ కౌన్సిలర్ పాల్ నరైన్ తెలిపారు.

## రేవంత్‌రెడ్డి వైషమ్యాలు సృష్టిస్తున్నారు

**హైదరాబాద్, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** డీలిమిటేషన్‌పై తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్‌రావు పార్టీ కార్యాలయంలో మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. ''కేరళ కంటే తెలంగాణ జనాభా ఎక్కువ. కేరళలో 20 ఎంపీ సీట్లు ఉంటే.. తెలంగాణలో 17 మాత్రమే ఉన్నాయి. సీఎం రేవంత్ ముందు కేరళలో సీట్లు తగ్గించమని కోరాలి. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు కూడా జనాభా ఉన్న రాష్ట్రాల్లో తక్కువ సీట్లు ఇచ్చారు. మహిళా రిజర్వేషన్లు, డీలిమిటేషన్ చేయాలని రాహుల్ గాంధీ కొత్త పార్లమెంట్ భవనంలోనే కోరారు. ఇప్పుడు 543 సీట్లలోనే మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది.

దక్షిణాదిలో కుటుంబ నియంత్రణ పాటించడం వల్ల జనాభా తగ్గింది.. ఉత్తరాదిన పాటించలేదని రాహుల్ గాంధీ, రేవంత్‌రెడ్డి వితండ వాదం చేస్తున్నారు. జీఎస్‌డీపీ మీద సీట్లు పెంచమనడం సరైంది కాదు. లోక్‌సభలో పెప్పర్ స్ప్రే చేయాలనే ప్లాన్‌లో కాంగ్రెస్ ఉంది. రాహుల్ గాంధీకి మించి రేవంత్ జాతీయ నాయకుడిగా ఎదుగుతున్నారు. రాహుల్ గాంధీకి సబ్జెక్ట్ తెలియక మాట్లాడటం లేదా? రేవంత్‌కు సబ్జెక్ట్ ఎక్కువ ఉండి మాట్లాడుతున్నారా? డీలిమిటేషన్‌ను ముందు వ్యతిరేకించింది స్టాలిన్. రేవంత్‌రెడ్డి మాత్రమే దక్షిణాది, ఉత్తరాది అని వైషమ్యాలు సృష్టిస్తున్నారు. తెలంగాణలో 50 శాతం సీట్లు పెరిగితే.. యూపీలో 50 శాతం పెరుగుతాయి. దక్షిణాదిలో సీట్లు గతంలోనే తగ్గాయి.. ఇప్పుడు తగ్గుతున్నట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారు.రాష్ట్ర ప్రభుత్వం చేసిన కుల గణన సక్రమంగా జరగలేదు. మా గల్లీలో ఎవరి ఇంటికీ ఎన్యూమరేటర్ రాలేదు. ఉత్తరాదిలో కాంగ్రెస్ లేదు.. దక్షిణాదిలో కూడా పోతుంది. దక్షిణాదిలో కాంగ్రెస్ కంటే బీజేపీకే ఎక్కువ ఎంపీ సీట్లు ఉన్నాయి. దేశంలో ఎప్పుడూ ఎన్నికలు జరుగుతూనే ఉంటాయి. పశ్చిమ బెంగాల్, తమిళనాడు ఎన్నికల్లో లబ్ధి పొందడానికే అని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఈ ఎన్నికల తర్వాత పెడితే యూపీ ఎన్నికలు అంటారు.. ఆ తర్వాత పెడితే తెలంగాణ ఎన్నికలు అంటారు. అందుకే వన్ నేషన్ వన్ ఎలక్షన్ వస్తే మంచిది'' అని రామచందర్ రావు అన్నారు.

## పార్లమెంట్ మాదిరిగా అసెంబ్లీలో సెంట్రల్ హాల్

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** తెలంగాణ శాసనమండలి భవనం పునర్నిర్మాణ పనులు పూర్తి చేసుకొని ఇటీవల సీఎం చేతుల మీదుగా ప్రారంభోత్సవం అయిన విషయం తెలిసిందే. ఇటీవల జరిగిన బడ్జెట్ సమావేశాలు కూడా నూతన శాసనమండలి భవనంలోనే నిర్వహించారు. కాగా, మండలిలో మిగిలిన ఉన్న పనుల పూర్తి పై మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి దృష్టి సారించారు. ఆయన తన ఛాంబర్ లో గురువారం ఆర్ అండ్ బీ శాఖ, ఆఘాఖాన్ సంస్థ, తెలంగాణ లెజిస్లేచర్ అధికారులతో సమావేశం నిర్వహించారు. పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని గుత్తా సుఖేందర్ రెడ్డి ఆదేశించారు. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు శాసన మండలి, శాసన సభ మధ్యలో పార్లమెంట్ తరహాలో సెంట్రల్ హాల్ పనులను త్వరగా ప్రారంభించాలని ఆయన ఆదేశించారు. శాసన మండలి సభ్యులకు, శాసన సభ సభ్యులకు సౌకర్యవంతంగా ఉండేలా సెంట్రల్ హాల్ డిజైన్ చేసి, పనులను చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో తెలంగాణ శాసన మండలి సెక్రెటరీ నరసింహాచార్యులు, ఓఎస్డీ గోవర్ధన్ రెడ్డి, పీఎస్ మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తేజస్వి సూర్య నీకెంత ధైర్యం?

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును ఇండియా, పాకిస్థాన్ విభజనతో పోల్చిన బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్యపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజల 6 దశాబ్దాల ఆకాంక్ష అంటే అంత చులకన అయ్యిందా అంటూ మండిపడ్డారు. మిస్టర్ తేజస్వీ సూర్య ఎంత ధైర్యం ఉంటే తెలంగాణ పోరాటాన్ని అవమానపరిచేలా మాట్లాడతావంటూ హెచ్చరించారు. తేజస్వీ వ్యాఖ్యలు తెలంగాణ ప్రజలను తీవ్రంగా అవమానించేలా ఉన్నాయని విమర్శించారు. 6 దశాబ్దాల పాటు ఎదుర్కొన్న వివక్షకు వ్యతిరేకంగా ఇక్కడి ప్రజలు చేసిన పోరాటాన్ని తక్కువ చేసి మాట్లాడతవా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమాన్నే కాకుండా తెలంగాణ సాధన కోసం ప్రాణ త్యాగం చేసిన అమరవీరులను కూడా తేజస్వీ అవమానించారని చెప్పారు. తెలంగాణ అస్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని కించపరిచేలా ఎవరు మాట్లాడిన సరే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

**బీజేపీ ఎంపీలు స్పందించాలి..**

తెలంగాణ ఉద్యమాన్ని కించపరిచేలా మాట్లాడిన తేజస్వీ వ్యాఖ్యలపై తెలంగాణ బీజేపీ ఎంపీలు స్పందించాలని కవిత డిమాండ్ చేశారు. ఈ వ్యాఖ్యలు తెలంగాణ సమాజానికి జరిగిన అవమానమని అన్నారు. ఈ వ్యాఖ్యలను మీరు సమర్థిస్తారా అంటూ వారిని ప్రశ్నించారు. వెంటనే ఈ వ్యాఖ్యలను ఖండించి తేజస్వీ సూర్యతో క్షమాపణలు చెప్పించాలని డిమాండ్ చేశారు. లేదంటే ఈ ప్రాంత ఎంపీలుగా కొనసాగే అర్హత మీకు లేదంటూ ఘాటైన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని కాపాడే సత్తా లేకపోతే పదవులకు రాజీనామా చేయాలని కవిత డిమాండ్ చేశారు.



## ప్రమాదాల నివారణకు చర్యలు

**జహీరాబాద్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలనప్రగతి ప్రణాళికలో భాగంగా అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత అవగాహన కల్పించడం జరిగింది. అందులో భాగంగా రంజోల్ ప్రధాన రహదారిపై నిర్వహించే వారాంతపు సంత తో రాకపోకలు సాగించే వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రమాద నివారణ చర్యలో భాగంగా పాలిటెక్నిక్ రహదారిని చదును చేసి రాబోయే వారాంతపు సంత అక్కడికి మార్చడం జరిగింది.ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ కాశీనాథ్, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నరేష్ గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

# హుగ్గేల్లి సిద్దుల గుట్టకు ఆధ్యాత్మిక వైభవం

- ఈనెల 27, 28, 29 తేదీల్లో మహోత్సవాలు
- గోడపత్రిక ఆవిష్కరించిన అవధూత గిరి మహారాజ్



**ఝరాసంగం/జహీరాబాద్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం హుగ్గేల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన సిద్దుల గుట్ట సిద్దేశ్వర స్వామి దేవస్థానంలో ఈ నెల 27, 28, 29 తేదీల్లో స్వామివారి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠాపన మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవాలకు సంబంధించిన గోడపత్రికలు, కరపత్రాలను గురువారం ఝరాసంగం మండలం బర్దిపూర్‌లోని దత్తగిరి మహారాజ్ ఆశ్రమంలో పీఠాధిపతి అవధూత గిరి మహారాజ్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. హుగ్గేల్లి గ్రామానికి ఆధ్యాత్మిక శోభను చేకూర్చేలా స్వామివారి ప్రతిష్ఠాపన కార్యక్రమాలను అత్యంత ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేస్తున్నామని తెలిపారు. మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు, భక్తుల కోసం అన్నదానం వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. స్వామివారి ఆశీస్సులు పొందేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని కమిటీ సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో రాజయోగ ఆశ్రమ పీఠాధిపతి రాచయ్య స్వామి, హుగ్గేల్లి గ్రామ సర్పంచ్ పట్లోళ్ల విమల శ్రీనివాస్ రెడ్డి, ఎస్‌బీ రాములు, ఉత్సవ కమిటీ సభ్యులు ఎంజీ మానయ్య, పుట్టి అశోక్, హైదరాబాద్ కిష్టారెడ్డి, అలాగే వైదిక పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.




# ప్రజాప్రతినిధులు ప్రజల నమ్మకాన్ని నిలబెట్టేలా పని చేయాలి

## ప్రజాపాలన ప్రగతి ప్రణాళికను ప్రజాప్రతినిధులు సమర్ధవంతంగా అమలు చేయాలి

**పెద్దేముల్,స్నేహిత ఎక్స్ ప్రెస్:**

గ్రామస్థాయిలో ప్రజా సమస్యల పరిష్కారం, మౌలిక సదుపాయాల మెరుగుదల కోసం ప్రభుత్వం చేపట్టిన "ప్రజాపాలనప్రగతి ప్రణాళిక (99 రోజుల కార్యచరణ ప్రణాళిక) కార్యచరణను ప్రజాప్రతినిధులు సమర్ధవంతంగా అమలు చేయాలని గనుల శాఖ ఉపసంచాలకులు, పెద్దేముల్ మండల స్పెషల్ ఆఫీసర్ సత్యనారాయణ సూచించారు.గురువారం పెద్దేముల్ మండల కేంద్రంలోని రైతువేదికలో "ప్రజాపాలనప్రగతి ప్రణాళిక (99 రోజుల కార్యచరణ ప్రణాళిక) మండల స్థాయి సమావేశాన్ని ప్రజాప్రతినిధుల, మండల, గ్రామ స్థాయి అధికారుల సమక్షంలో నిర్వహించి పలు కీలక అంశాలపై దిశా నిర్దేశం చేశారు.ఈ సందర్భంగా గనుల శాఖ ఉపసంచాలకులు, పెద్దేముల్ మండల స్పెషల్ ఆఫీసర్ సత్యనారాయణ మాట్లాడుతూ..గ్రామాల్లో నూతనంగా గెలుపొందిన సర్పంచులు తమ బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వర్తిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో ప్రజలకు త్రాగునీటి సరఫరా,వీధి దీపాల ఏర్పాటు, మురుగు కాల్వల

పరిశుభ్రత,అంతర్గత రోడ్ల పరిశుభ్రత,సంరక్షణ వంటి మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.గ్రామాల్లో పరిశుభ్రత. కనీస సౌకర్యాల మెరుగుదల ద్వారా ప్రజలకు ఏలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అదే విధంగా అధికారులు, ప్రజాప్రతినిధులు పరస్పర సమన్వయంతో పనిచేస్తేనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు చేరేలా అధికారులు ప్రతి ఒక్కరు ప్రజాప్రతినిధుల సమన్వయంతో క్షేత్రస్థాయిలో కృషి చేయాలని, ప్రతి శాఖకు సంబంధించి అధికారులు తమ బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వర్తించాలని ఆదేశించారు .సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొని, తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు ఆయా శాఖల వారీగా సాధించిన పురోగతిని వివరించారు. అలాగే ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, వాటి ప్రయోజనాలు, లబ్దిదారులకు అందించే విధానాన్ని గురించి క్లుప్తంగా వివరించారు. అనంతరం జయరాం తాండ (ఇందూరు) సర్పంచ్ నేనావత్ సురేష్ సౌజన్యంతో ఆయా గ్రామాల సర్పంచులను ఆయా శాఖల అధికారులు ఘనంగా సన్మానించగా,అధికారులను ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు ఘనంగా సన్మానించారు.అనంతరం జయరాం తాండ(ఇందూరు) సర్పంచ్ నేనావత్ సురేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజనాన్ని ప్రజాప్రతినిధులు, అధికారులు సంయుక్తంగా అందరు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ వెంకటేష్ ప్రసాద్,ఎంపీడీఓ కే.తిరుమల స్వామి, ఎంఈఓ నర్సింగ్ రావు,ఎంపీఓ రతన్ సింగ్, మండల పరిషత్ సూపరింటెండెంట్ వెంకట కృష్ణ, ఏపీఓ నర్సింహులు, ఏపీఎం శివయ్య, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్వేత,ఎస్ఐ ఎం.ప్రశాంత్ వర్ధన్,ఏఓ పవన్ ప్రీతం, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ మమత, ఐసీడీయస్ సూపర్ వైజర్ సునీతా,వెటర్నరీ డాక్టర్ శ్రీదీప్తి ,హౌసింగ్ ఏఈ ఆకాంక్ష, పీఆర్ ఏఈ వినోద్ కుమార్,ఏఈఓలు,ఆయా గ్రామాల సర్పంచులు,ఉప సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.



- గ్రామాల్లో ప్రజలకు మౌలిక వసతుల పట్ల ఇబ్బందులు లేకుండా చూడాలి
- అధికారులు ప్రజాప్రతినిధులు పరస్పరం సమన్వయంతో ముందుకు సాగాలి
- ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజాల్లోకి తీసుకెళ్ళాల్సిన బాధ్యత అధికారులు, ప్రజాప్రతినిధులదే
- మండల స్థాయి ప్రజాప్రతినిధుల, అధికారుల సమావేశంలో
- గనుల శాఖ ఉపసంచాలకులు, పెద్దేముల్ మండల స్పెషల్ ఆఫీసర్ సత్యనారాయణ



### విద్యార్థుల మనసుల్లో నిలిచిన

# గురువు దూస శ్రీనివాస్

- ఇందూరు పాఠశాలలో దూస శ్రీనివాస్‌కు ఘనంగా సంస్మరణ సభ
- విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేసిన గురువును స్మరించిన ఉపాధ్యాయులు, గ్రామస్థులు



**పెద్దేముల్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** ఇటీవల గుండెపోటుతో అకాల మరణం చెందిన ఉపాధ్యాయుడు దూస శ్రీనివాస్ స్మారకార్థం ఇందూరు పాఠశాలలో గురువారం సంస్మరణ సభను నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని గ్రామస్థులు, ఉపాధ్యాయులు కలిసి ఏర్పాటు చేసి,ఆయన సేవలను భావోద్వేగంతో స్మరించుకున్నారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ జి.వెంకటేష్ ముదిరాజ్ మాట్లాడుతూ..దూస శ్రీనివాస్ విద్యార్థుల అభ్యున్నతిని లక్ష్యంగా పెట్టుకుని నిరంతరం కృషి చేసిన ఆదర్శ ఉపాధ్యాయుడని కొనియాడారు.విద్య అంటే కేవలం పాఠ్యపుస్తకాలకు పరిమితం కాకుండా, విద్యార్థుల వ్యక్తిత్వ వికాసం కూడా అవసరమని నమ్మి,ఆ దిశగా ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. సహ ఉపాధ్యాయులు పలువురు మాట్లాడుతూ..ప్రతీ రోజు విద్యార్థుల భవిష్యత్తు కోసం ఏదో ఒక మంచి పని చేయాలనే తపనతో దూస శ్రీనివాస్ పనిచేసేవారని గుర్తుచేసుకున్నారు. ముఖ్యంగా పేద విద్యార్థులకు ఆయన అందించిన సహాయం, ప్రోత్సాహం ఎన్నటికీ మర్చిపోలేమని పేర్కొన్నారు.

విద్యార్థులు కూడా తమ గురువు గారి జ్ఞాపకాలను స్మరించుకుంటూ,ఆయన బోధనలు తమ జీవితాలకు మార్గదర్శకమని భావోద్వేగానికి లోనయ్యారు. చివరగా, దూస శ్రీనివాస్ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థిస్తూ సభ ముగించారు.ఈ కార్యక్రమంలో పెద్దేముల్ మండల ఎంఈఓ నర్సింగ్ రావు ,ఇందూరు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు,గ్రామస్థులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక మండల స్థాయి సమావేశం

**అల్లాదుర్గం,స్నేహిత ఎక్స్ ప్రెస్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 డేస్ లో భాగంగా మండల స్థాయి సమావేశాన్ని గురువారం అధికారులు నిర్వహించారు. ముందుగా జయహే తెలంగాణ పాటతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. సందర్భంగా ఆయా శాఖల అధికారులు తమ శాఖకు సంబంధించిన ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. ముఖ్యమంత్రి గారి సందేశాన్ని చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో వట్టిపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మి శేషారెడ్డి, మండల స్పెషల్ ఆఫీసర్ కరుణాకర్, సీఐ రేణుక రెడ్డి, ఎస్సై శంకర్, ఎంపీడీవో చంద్రశేఖర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శేషారెడ్డి,ఏవో రాజేష్ కుమార్,ఎంపీఓ ప్రభాకర్,అల్లాదుర్గం సర్పంచ్ సౌమ్య సురేష్ గౌడ్, ఆయా గ్రామాల సర్పంచులు వీరన్న,శంకర్ నాయక్, రవి, మచ్చేందర్,తదితరులు పాల్గొన్నారు.

### గ్రామపంచాయతీ వాహనాలకు

# భద్రత షెడ్ నిర్మాణం

- ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తున్న వైన్యం
- సర్పంచ్ ఆలోచన విధానానికి ప్రశంస జల్లు వెల్లువ
- కల్లూర్ జీ.పీ.ఆవరణంలో రూ.2.5 లక్షలతో షెడ్ శ్రీకారం

**కోటగిరి,స్నేహిత ఎక్స్ ప్రెస్:** నిజామాబాద్ జిల్లా బాన్సువాడ నియోజకవర్గం పోతంగల్ మండలంలోని కల్లూర్ గ్రామం లో గ్రామపంచాయతీ వాహనాలకు ఒక ప్రత్యేకమైన షెడ్ నిర్మించిన తీరు పలు గ్రామాలకు ఆదర్శప్రాయంగా నిలిచింది.గ్రామ అవసరాల కోసం నిత్యం వినియోగిస్తున్న గ్రామ పంచాయతీ ట్రాక్టర్,వాటర్ ట్యాంక్,పారిశుద్ధ్య వాహనాలకు సరైన రక్షణ అలాగే వాటి యొక్క కాల పరిమితి పెంపునకు గ్రామ సర్పంచ్ చెన్నూర్ రాంరెడ్డి చేసిన ఆలోచించిన విధానానికి పలువురీ నుండి ప్రశంసల జల్లు వెల్లువెత్తుతోంది.వాహనాల యొక్క కాలపరిమితినీ పెంచడంతో పాటుగా



వాటికి సరైన రక్షణ కూర్పునకై కల్లూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన షెడ్ ఇతర గ్రామాల వారు ఆదర్శప్రాయంగా తీసుకోవాలని పలువురు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.గ్రామ ప్రజల సమక్షంలో సర్పంచ్ ముందుచూపు ఆలోచనను గ్రామసభ ద్వారా గ్రామ పంచాయతీ నిధులు రూ.2.5 లక్షలతో ఈ షెడ్ ను శ్రీకారం గావించడం పట్ల ఉమ్మడి మండలాలలో చర్చనీయాంశంగా మారింది.ఈ షెడ్డు నిర్మాణం పట్ల స్థానిక ప్రజలే కాకా ఇతర గ్రామాల ప్రజలు,ప్రజా ప్రతినిధులు, నాయకులు సర్పంచ్ ఆలోచన విధానానికి అభినందనలు వ్యక్తం చేస్తున్నారు.




## రోడ్డు భద్రత నియమాలు పాటించాలి: సీఐ రేణుక రెడ్డి

**అల్లాదుర్గం,స్నేహిత ఎక్స్ ప్రెస్:** రోడ్డు భద్రత నియమాలను పాటించి ప్రమాదాల నివారణకు సహకరించాలని CI రేణుకా రెడ్డి అన్నారు. 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని అల్లాదుర్గంలోని వెంకటేశ్వర ఆలయంలో ఏర్పాటు చేసి వాహనాదారులకు, అధికారులకు అవగాహన నిర్వహించారు.విధిగా ప్రతి ఒక్కరూ వాహనదారులు హెల్మెట్, సీటు బెల్టు ధరించి తమ విలువైన ప్రాణాలను కాపాడుకోవాలని అన్నారు.అనంతరం ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల లక్ష్మి శేషారెడ్డి,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొప్పుల శేషారెడ్డి,అల్లాదుర్గం సర్పంచ్ మద్దూర్ సౌమ్య సురేష్ గౌడ్, రెడ్డిపల్లి సర్పంచ్ నరసింహారెడ్డి, అధికారులు ప్రజలు పాల్గొన్నారు.

### "స్నేహిత ఎక్స్ ప్రెస్" కథనానికి స్పందన...

# చెత్త కుప్పల తొలగింపు

- స్నేహిత ఎక్స్ ప్రెస్ ఎఫెక్ట్
- ప్రధాన రహదారి పరిశుభ్రతకు చర్యలు
- స్నేహిత ఎక్స్ ప్రెస్ కథనంతో కదిలిన మంబాపూర్ గ్రామ పంచాయతీ సిబ్బంది
- చెత్త తొలగింపుతో ప్రజలకు ఉపశమనం
- పరిశుభ్రతకు గ్రామపంచాయతీ ప్రత్యేక చర్యలు
- సర్పంచ్ ఎం.భార్గవిపై గ్రామస్తుల ప్రశంసలు


ప్రధాన రహదారి పక్కన చెత్త కుప్పలు
- మంబాపూర్‌లో గ్రామంలో అధ్వాన స్థితి
- ట్రాన్స్ ఫార్మర్ పక్కనే చెత్త పేరుకుపోవడంతో ప్రజలకు ఇబ్బందులు

ఎక్స్‌ప్రెస్ | epaper.expresstelugudaily.com | 16 Apr, 2026 | Page: 3 | Clip ID: C-246971
For more details, visit epaper.expresstelugudaily.com



**పెద్దేముల్,స్నేహిత ఎక్స్ ప్రెస్:**

ప్రధాన రహదారి పక్కన చెత్త కుప్పలు అనే శీర్షికతో స్నేహిత ఎక్స్ ప్రెస్ దినపత్రికలో గురువారం ప్రచురితమైన కథనానికి మంబాపూర్ గ్రామ సర్పంచ్ ఎం.భార్గవి వెంటనే స్పందించారు.ఈ మేరకు గ్రామ పంచాయతీ సిబ్బందిని అప్రమత్తం చేస్తూ వారి సహాయంతో మంబాపూర్ గ్రామం నుండి పెద్దేముల్, జనగాం గ్రామాలకు వెళ్ళే ప్రధాన రహదారి ప్రక్కన పేరుకుపోయిన చెత్త కుప్పలను పూర్తిస్థాయిలో తొలగింపచేయించారు. ముఖ్యంగా మంబాపూర్ గ్రామం నుండి పెద్దేముల్, జనగాం గ్రామాలకు వెళ్ళే ప్రధాన రహదారి ప్రక్కన చెత్త ఎక్కడికక్కడ పేరుకుపోయి కాలనీ వాసులు, వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని స్నేహిత ఎక్స్ ప్రెస్ దినపత్రిక ప్రతినిధి ఓ ప్రత్యేక కథనం ద్వారా గురువారం వెలుగులోకి తీసుకొచ్చారు. దీనిపై వెంటనే స్పందించి చర్యలు తీసుకున్న మంబాపూర్ గ్రామ సర్పంచ్ ఎం.భార్గవి గ్రామంలో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇచ్చారు.గ్రామ పంచాయతీ సిబ్బంది యంత్రాలతో పూర్తిగా చెత్తకుప్పలను తొలగించి రహదారిని శుభ్రం చేశారు.దీంతో కాలనీవాసులకు, వాహనదారులకు,పాదచారులకు ఉపశమనం లభించింది.ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ సమస్యను గుర్తించి వెంటనే స్పందించిన సర్పంచ్ ఎం. భార్గవిని అభినందించారు. పెద్దేముల్ మండలంలో స్నేహిత ఎక్స్ ప్రెస్ దినపత్రిక ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తూ పరిష్కారానికి దోహదపడుతుందని పేర్కొన్నారు. అనంతరం గ్రామస్తులు సర్పంచ్ ఎం.భార్గవికి,స్నేహిత ఎక్స్ ప్రెస్ దినపత్రికకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

# ఘనంగా రిపోర్టర్ ప్రతాప్ జన్మదిన వేడుకలు



నారాయణఖేడ్,స్నేహిత ఎక్స్ ప్రెస్: మున్సిపల్ పట్టణ పరిధిలోని కాక ఎలక్ట్రానిక్ షాప్‌లో రిపోర్టర్ ప్రతాప్ జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, శాలువా కప్పి ప్రతాప్‌ను ఘనంగా సన్మానించారు. హాజరైన వారు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు .ఈ కార్యక్రమంలో మీడియా జేఏసీ నారాయణఖేడ్ అధ్యక్షులు అమృతం,సైద్,మజార్ ఖాన్, వడ్ల రమేష్,వజిత్, నిస్సార్, సునీల్, అంబదాస్, చోటు మియా తదితరులు పాల్గొన్నారు.

# టిడిపి జాతీయ కమిటీలో తెలంగాణ నేతలకు ప్రాధాన్యం

## తెలుగుదేశం పార్టీ నాయకులు పోగుల సైదులు గౌడ్



**మిర్యాలగూడ, స్నేహిత ఎక్స్‌ప్రెస్:**

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు మరియు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ప్రకటించిన తెలుగుదేశం పార్టీ జాతీయ కమిటీలో జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గా నారా లోకేష్ మరియు తెలంగాణ శాఖ పెద్దపీట వేసినందుకు పోలిట్ బ్యూరో సభ్యులుగా బక్కని నరసింహులు, అరవింద్ కుమార్ గౌడ్ అధికార ప్రతినిధిగా నన్నూరి నర్సిరెడ్డి, తిరునగరి జ్యోత్స్న కి చోటు కల్పించినందుకు తెలంగాణ తెలుగుదేశం పార్టీ నాయకులు పోగుల సైదులు గౌడ్ హర్షం వ్యక్తపరుస్తూ ప్రాధాన్యం పొందిన నాయకులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ తెలంగాణలో రాబోయే రోజుల్లో తెలుగుదేశం పార్టీ పూర్వము దిశగా అడుగులు వేస్తుంది. అనడానికి ఇది మొదలు అన్నారు. తెలంగాణ వ్యాప్తంగా తెలుగు తమ్ముళ్లు సంబరాలు చేసుకునే సందర్భం అన్నారు. అదినాయకత్వం ఇచ్చిన ఉత్సాహంతో రెట్టింపు కష్టంతో తెలంగాణలో పసుపు జెండా రెపరెపలాడే వరకు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు కృషి చేస్తానన్నారు. ముఖ్యంగా తెలంగాణలో నిఖార్సైన తెలుగుదేశం పార్టీ నాయకులు నీతి నిజాయితీ తో పని చేస్తున్న వారికి అత్యున్నత స్థానం కల్పించినందుకు నారా చంద్రబాబు నాయుడు, లోకేష్ కి ప్రత్యేక ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలియచేశారు.

## స్నేహిత ఎక్స్ ప్రెస్ కథనాలకు స్పందించిన

# డీపీఓ

### 3 గ్రామాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించిన డీపీఓ

- స్నేహిత ఎక్స్ ప్రెస్ దినపత్రికలో వచ్చిన కథనాలకు ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శుల నుండి వివరణలు తీసుకోవాలని ఎంపీఓ రతన్ సింగ్ ను ఆదేశించిన డీపీఓ
- లిఖితపూర్వకంగా వివరణలు రాసి ఇచ్చిన ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు
- సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని వివరణలో పేర్కొన్న ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు




**పెద్దేముల్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** వికారాబాద్ జిల్లా తాండూరు నియోజకవర్గం పెద్దేముల్ మండల పరిధిలోని మన్ సాన్ పల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో "త్రాగునీటి కోసం విద్యార్థుల తంటాలు", మంబాపూర్ గ్రామంలో "ప్రధాన రహదారి ప్రక్కన చెత్త కుప్పలు", ఖానాపూర్ గ్రామంలో "లక్షలు ఖర్చుచేసిన ట్రాక్టర్ మూలన పడేసిన అధికారులు" అనే వేరు వేరు శీర్షికలతో స్నేహిత ఎక్స్ ప్రెస్ దినపత్రికలో ప్రచురితమైన కథనాలకు గురువారం వికారాబాద్ జిల్లా పంచాయతీ అధికారి జయసుధ స్పందించారు.ఈ మేరకు స్నేహిత ఎక్స్ ప్రెస్ దినపత్రికలో వచ్చిన కథనాల విషయమై ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పెద్దేముల్ మండల ఎంపీఓ రతన్ సింగ్ ను అడిగి తెలుసుకొన్నారు.అదే విధంగా మండల పరిధిలోని మన్ సాన్ పల్లి, మంబాపూర్, ఖానాపూర్ గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై స్నేహిత ఎక్స్ ప్రెస్ దినపత్రికలో వచ్చిన వేరు వేరు కథనాలకు గాను ఆయా గ్రామాల సంబంధిత పంచాయతీ కార్యదర్శుల ద్వారా లిఖిత పూర్వకంగా వివరణలు తీసుకొని తనకు పంపాలని మండల ఎంపీఓ రతన్ సింగ్ ను ఆదేశించారు. డీపీఓ ఆదేశాల మేరకు ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు లిఖితపూర్వకంగా వివరణలను రాసి ఎంపీఓకు ఇవ్వగా ఆయన డీపీఓ కార్యాలయానికి పంపారు.అందులో భాగంగా ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు స్నేహిత ఎక్స్ ప్రెస్ దినపత్రికలో వచ్చిన సమస్యల పరిష్కారానికి గాను మన్ సాన్ పల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ప్రత్యామ్నాయంగా పంచాయతీ ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా చేయించడం జరుగుతుందని,రెండు రోజుల్లో శాశ్వత పరిష్కారం చేస్తామని తెలుపడం జరిగిందని, మంబాపూర్ గ్రామంలో ప్రధాన రహదారి ప్రక్కన ఉన్న చెత్త కుప్పలను గ్రామ పంచాయతీ సిబ్బంది ద్వారా తొలగింప చేశామని, ఖానాపూర్ గ్రామంలో మూలకు పడ్డ ట్రాక్టర్ ను వీలైనంత త్వరగా రిపేరు చేయించి అందుబాటులోకి తీసుకొస్తామని ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు వివరణలో లిఖితపూర్వకంగా రాసి ఇచ్చారని మండల ఎంపీఓ రతన్ సింగ్ తెలిపారు.











## అంబేద్కర్ జయంతి వేడుకల్లో దళిత ప్రజాప్రతినిధుల అవమానం ఆరోపణలు

- గాజీపూర్ సర్పంచ్,కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా కలెక్టర్
- డీపీఓలకు గాజీపూర్ ఉప సర్పంచ్ గడ్డమీది ఎల్లప్ప ఫిర్యాదు





**పెద్దేముల్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలం గాజీపూర్ గ్రామంలో అంబేద్కర్ జయంతి కార్యక్రమం సందర్భంగా దళిత ప్రజాప్రతినిధులను అవమానించినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి.ఈ మేరకు గాజీపూర్ ఉప సర్పంచ్ గడ్డమీది ఎల్లప్ప గురువారం జిల్లా కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) లకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు.

ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం..ఏప్రిల్ 14న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ జయంతిని గాజీపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద అధికారికంగా నిర్వహించారు.అయితే ఈ కార్యక్రమానికి గాజీపూర్ గ్రామ ఉప సర్పంచ్ అయిన గడ్డమీది ఎల్లప్పతో పాటు దళిత వార్డు సభ్యులు ఆదిమల్ల కృష్ణ,మొండి లక్ష్మి తదితరులకు సమాచారం ఇవ్వలేదని ఆరోపించారు.ఈ విషయమై గాజీపూర్ గ్రామ ఉపసర్పంచ్ గడ్డమీది ఎల్లప్ప గ్రామ పంచాయతీ కార్యదర్శి రమేష్‌ను ఫోన్ ద్వారా సంప్రదించగా నిర్లక్ష్యంగా స్పందించినట్లు తెలిపారు. గాజీపూర్ గ్రామ సర్పంచ్ పట్లోళ్ల హేమలత, కార్యదర్శి రమేష్ ఒక్కటై కావాలనే ఉద్దేశపూర్వకంగా దళిత ప్రజాప్రతినిధులను అవమానించారని ఫిర్యాదులో పేర్కొన్నారు.అదేవిధంగా, మహిళ సర్పంచ్ ఉన్నప్పటికీ ఆమె భర్త పట్లోళ్ళ లాల్ రెడ్డి గ్రామంలోని అధికారిక కార్యక్రమాల్లో జోక్యం చేసుకుంటూ పెత్తనం చెలాయిస్తున్నారని కూడా ఆరోపించారు.ఈ ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని గాజీపూర్ ఉప సర్పంచ్ గడ్డమీది ఎల్లప్ప జిల్లా కలెక్టర్ దీపక్ తివారి,డీపీఓ జయసుధ లను కోరారు. గాజీపూర్ గ్రామంలో ప్రజాస్వామ్య పద్ధతులు పాటించకుండా వ్యవహరిస్తున్న వారిపై తగిన చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.ఉన్నతాధికారులు విచారణ చేపట్టి నిజానిజాలు వెలికితీయాల్సి ఉంది.ఈ కార్యక్రమంలో గాజీపూర్ గ్రామ ఉపసర్పంచ్ గడ్డమీది ఎల్లప్ప,వార్డు సభ్యుడు కృష్ణ,ప్రవీణ్,తదితరులు పాల్గొన్నారు.

## ముస్లాపూర్ 161 హైవేపై యాక్సిడెంట్

**అల్లాదుర్గం,స్నేహిత ఎక్స్ ప్రెస్:** మండలం ముస్లాపూర్ వద్ద 161వ జాతీయ రహదారిపై బైక్, టాటా ఏసీ ఢీకొన్న ప్రమాదంలో వెలుపుగొండకు చెందిన వెంకటేశం (40) తీవ్రంగా గాయపడ్డారు.రోడ్డు దాటుతున్న క్రమంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న 108 సిబ్బంది ఈఎంటీ మహేష్ కుమార్, పైలట్ దుర్గయ్య తక్షణమే స్పందించి, క్షతగాత్రుడికి ప్రథమ చికిత్స అందించి జోగిపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయనకు వైద్యులు చికిత్స అందిస్తున్నారు.






## ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక

# మండల స్థాయి సమావేశం

**పాల్గొన్న అన్ని శాఖల మండల స్థాయి అధికారులు**

**కంగ్టి,స్నేహిత ఎక్స్ ప్రెస్:** సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గం కంగ్టి మండల కేంద్రంలోని బసవ ప్రదీప్ కళ్యాణ మంటపంలో ఈ సమావేశం నిర్వహించడం జరుగింది.ఎంపిడిఓ సత్తయ్య మాట్లాడుతూ..ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సంక్షేమ పథకాలను ప్రజలకు అందేలా చూడాల్సిన భాధ్యత అధికారులు ప్రజా ప్రతినిధులే అని తెలిపారు. వివిధ శాఖలకు సంబంధించిన సమగ్ర కార్యాచరణ నివేదికలను ఆయా శాఖల అధికారులు వివరించడం జరిగింది. సర్పంచ్లు కూడా గ్రామపంచాయతీలో సమస్యల ను అధికారులకు తెలపడం జరిగింది .ఈ కార్యక్రమంలో కంగ్టి మండలంలోని సర్పంచ్లు మరియు ఉప సర్పంచ్లు వారితోపాటు గ్రామపంచాయతీ కార్యదర్శులు మరియు మండల స్థాయి అధికారులందరూ సమావేశమునకు హాజరు కావడం జరిగింది.ఈ సమావేశంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు పరుస్తున్నటువంటి పథకాలపై చర్చించడం జరిగింది.అందులో ముఖ్యమైనవి రైతు భరోసా ఇందిరమ్మ ఇల్లు మహాలక్ష్మి పథకంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం రూపాయలకు 500 కే సబ్సిడీ గ్యాస్ సిలిండర్ గృహజ్యోతి 200యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ , పెన్షన్లు కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ ఇందిరా మహిళా శక్తి స్వయం సహాయక సంఘాలకు ఏషెబ్జి బ్యాంక్ రుణాలు వడ్డీ లేని రుణాలు ఇందిరమ్మ చీరలు కొత్త రేషన్ కార్డులు మొదలైన వాటి గురించి చర్చించడం జరిగింది.అందువల్ల సమస్త గౌరవ సర్పంచ్లకు ఉప సర్పంచ్లకు అధికారులకు మరియు పాత్రికేయ మిత్రులందరికీ స్వాగతం పలుకుతూ సమావేశంలో జరిగిన చర్చల్లో పాల్గొని సంపూర్ణం చేయడం జరిగింది.

